# పట్టు చొక్కా

[కథానిక]

●

## శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

వారంరోజులయి ప్రయత్నం ఎగ్జిబిషను చూద్దాం అని. ఎంతో యిదిగా చెప్పుకుంటున్నారు ఊళ్ళో మహా గొప్పప్రదర్శనం అనీ, ఆ అపురూపపు వస్తువులతో కళ్లు మిణిగిపోతున్నాయనీని. ఆవేళ తప్పకుండా వెళ్ళితీరాలనుకున్నాను.

ఆరూ కొట్టేరు. వేడిగాడుపు వీస్తున్నా, సాయంత్రపు నీరెండ ఆహ్వానిస్తూనే వుంది. కాంపౌండులో చెట్లూ చేమలూ స్వర్ణాభను వర్జించి, త్వరగా శబలవర్ణాన్ని పైకొంటున్నాయి. గిలకనూతిదగ్గర అరటిపిలకలకి నీళ్లు పోస్తూన్న మాలీ మరో రెండు బాల్చీలు తోడి చప్టామీద పెట్టేడు నాకోసమని.

స్నానం అయింది. పట్టు లాల్చీ, సన్నధోవతీ యిచ్చేడు నౌఖరు.

వాకిట్లో పిలుపు. జానకమ్మగారి యింటినుంచి మళ్ళీ కబురు వొచ్చింది.

"వస్తున్నానోయ్, తమ్ముడూ."

"జ్వరం చాలా తీవ్రంగా ఉందండీ. రాత్రి నుంచీ కన్నుపొడుచుకున్నా కునుకు పట్టలేదు అక్కయ్యకి. పరధ్యానపుమాటలు కూడాను."

"ఎలాగ చెప్పు, నాయనా, టైఫాయిడు లక్షణమే అది."

"ఏమిటోనండి. మీరొకమాటు వచ్చి చూస్తే మాకు ధైర్యంగా వుంటుంది."

"ఊఁ, పద. ఈ హేండ్ బేగు కారులో పెట్టు."

పట్టుమని పావుగంటఅయినా శాంతంగా ఉండనివ్వరు యింటిదగ్గర. ఏ టౌనుహాలుకో పోతే అక్కడా... తయారవుతారు. ఇంకో పేషంటుని చూడ్డానికి వెళ్ళేమంటే, ఆ యింటిముందూ వీళ్ళే పికెటింగు! తీరా వెళ్ళి చూస్తే అంతా పైవాళ్ళు పడే కంగారే. పేషెంటు నిక్షేపంలాగ ఉంటాడు. పరిస్థితి ఏమాత్రం విషమంగా ఉన్నా డాక్టరు ఆ మంచం వదిలివెళతాడా? ఇంకాయిదిగా ఉంటే యింకో డాక్టర్ని తనే పిలుచుకు రాడూ కన్సల్టేషనుకి? ఈ ముక్కలు వాళ్ళకి తోచవు. ఏ ఉద్యోగస్థుడికయినా పనివేళా, తీరుబాటూ అంటూ వుంటాయిగాని డాక్టరుకు మాత్రం ఉండవు.

* * *

ఎగ్జిబిషను చేరుకునేసరికి ఎనిమిదీ కొట్టేరు. వసంతోత్సవం మూర్తీభవించినట్టుంది ఆవరణ. ఏమి జనసమ్మర్దం! చూసినకొద్దీ యింకా చూడాలనీ, బయటికి రాగానే అప్పుడే వచ్చేసేమా అనీ అనిపిస్తున్నాయి ఆ అంగళ్ళలో వస్తువులు. ఎంత నాజూకు! ఏమి పనివాడితనం!! ఎంతటి నైపుణ్యం!!! జేబులో ద్రవ్యానికి పరిమితి అంటూ ఉండబట్టి కొనడానికికూడా అంతు ఒకటి ఏర్పడుతోంది గాని, లేకపోతేనా! అనాకర్షణీయమయిన వస్తువేదీ అక్కడ? చూస్తూన్నకొద్దీ యినుమడిస్తూన్న కళాతృష్ణతో ఒక్కొక్క 'స్టాలే' చూసుకుంటూ కాశ్మీరశాలువల దుకాణంలో ప్రవేశించేను.

శ్రీనగరంలో నేతపర్వంగా చూసేనాయిని ఆ నేతగాళ్ళ హస్తనైపుణ్యం.

చుట్టూ కాకగపువ్వు అంచూ, నాలుగు మూలలా మామిడిపిందెలూ ఉన్న, పాలమీగడలాంటి శాలువ ఒకటి పరీక్షిస్తున్నాను. ప్రక్కనే ఎవరో గొంతుక సవరించుకున్నారు. చిన్నగా దగ్గి—

"ఈ లతలఅంచు ఎంత చమత్కారంగా చిత్రించేరో చిత్తగించేరూ ?" అన్నా డాయన.

"శేషుగ్గానే వుంది. కాని, నాకు కాకరపువ్వ అంచు అంటే కొంచెం ప్రీతిలెండి" అన్నాను.

"అలాగే. 'లోకో భిన్నరుచిః'. కాని, చిత్తగించేరూ, యీ లతలో పువ్వులూ, మొగ్గలూ అవీ వున్న చోట ఆయా రంగులకి అనుగుణంగా మ్రుచ్చిపనీ..."

"చిత్తం చిత్తం. ఆ చిత్రం ఊహించడానికీ, రంగుల యెన్నికకీ ప్రత్యేకించి ఉంటారు ఆరితేరిన మనుష్యులు."

"ఆ ఊహాచిత్రపుప్రతిభ రసవత్తరంగా బట్టమీద ప్రస్ఫుటీకరించే కుట్టుపనివాళ్లుకూడా..."

"శిల్పనైపుణ్యంలో ఏమాత్రమూ తీసిపోరు. కళా చాతురీ కాదటండీ"

"అసలు కాశ్మీరదేశమే ఓ కళానిలయం"

"తమరూ పర్యటించే రన్నమాట."

ఇంక బాతాఖానీలో పడ్డాం. ఆ దేశ సౌందర్యం, అచ్చటివారి జీవితవిధానాలు, ఆ కళారాధన, అక్కడి స్త్రీపురుషుల అందచందాలు...అబ్బో, ఆయనా ఆసేతుశీతనగపర్యంతం తిరిగినవాడే! మాటలాడుకుంటూనే ప్రదర్శనంగేటు దాటేం. మాయింటికి ఆహ్వానించేను. ఫలానావీథిలో తనకు పని ఉన్నదనీ, అందాకా దిగబెడితే సంతోషిస్తాననీ అన్నాడు. స్విచ్ వేసి, ఛోక్ లాగి, ఏక్సిలరేటరు కొద్దిగా నొక్కేను. హేండిలు త్రిప్పి వచ్చి నా ప్రక్కనే అధిష్ఠించేడు ఆయన. పది గజాలు సాగింది కారు.

"తమరు అన్యథా భావించరు కదా పంతులుగారూ, ఓ చిన్నవిషయం మనవిచేస్తాను"—ఆయనే ఆరంభించేడు.

"సెలవివ్వండి"

"అహఁ, మరేమీ లేదు...ఆ లాల్చీ...మీరు తొడుక్కున్నదీ... మీది కాదేమో ననీ..." అర్ధోక్తిలో వదిలేసేడు.

ఆశ్చర్యంతో నిలువునా స్తంభించిపోయేనంటే నమ్మండి. నిజమే, నాది కాదది. కాని, నాకు సరిగ్గా సరిపోయింది. కాగా, నాదానికన్నా కొత్త కొత్త దీని. రెండూ పట్టుచొక్కాలే. యీయనకి ఎలాగ తెలిసింది చెప్మా ?

"తమరు నేషనల్ లాండ్రీలోనే యిస్తూ ఉంటారా బట్టలూ ?" మళ్ళీ అడిగేడు ఆయన.

"చిత్తం చిత్తం. నా చొక్కా మారుగిళ్ళయింది లెండి. యిదిగానీ తమదా ఏమిటి ?" అన్నాను కంగారుగా.

"అబ్బే. నాది కాదు లెండి. మీదికూడా కాదని తెలిసీ..."

"ఔనాను. అసలు యిచ్చేద్దామనే అనుకున్నాను, కాని మడతలు విప్పి తొడుక్కున్నదాకా అది నాది కాదని తెలియలేదు. తీరా తొడుక్కున్నాక ఉహూఁ, ఎలాగా తొడుక్కున్నాంకదా, రేపు యిచ్చివొచ్చును అని అనుకున్నాను—మరి" అన్నాను తుంటవ్యణ్ణి అని వ్యంగ్యంగా తోచేటట్టు.

"దానికేం లెండి. మీ చొక్కామాత్రం లాండ్రీలోనే ఉంది అని చెప్పొచ్చేను. దానిమీద మీ పేరు పొడిఅక్షరాలు 'వ. సు.' అనికూడా ఉన్నాయి. దీనిమీద ఉన్న అక్షరాలు 'క. సో.' కదూ ?

అయ్యో, వీడి అసాధ్యం గూలా! సి. ఐ. డీ. కన్నా దారుణం అయిపోతేనూ!

౨

వీథిమలుపులో కారు ఆపమన్నాడు. ఆ యిల్లు తనదే నట. అభ్యంతరం లేకపోతేలోపలికి రమ్మన్నాడు. ముద్దుగా చిన్న యిల్లు—బొమ్మరిల్లులాగ. వీథిచీడీకి పైగా పది పది హేనుగజాల ఆవరణ, చిన్నగేటూను. బండీగూడులాగ వంచికట్టిన వెదురుబద్దలపైకి దట్టంగా అల్లుకు పాకిన 'నైట్‌క్వీన్' గుమ్ముమని కమ్మని వాసనలు వెదజిమ్ముతోంది. ఆవరణకి నాలుగు మూలలా నాలుగు చంద్రకాంతమొక్క లున్నాయి. మధ్యని వత్తుపగా పదిలపరిచిన మట్టిపళ్లెరంలో ఒక్కటే ఒక్క గులాబీ చెట్టు, చిగురుకొమ్మని రెండు విడీవిడని మొగ్గలతో పిల్లగాలికి తల ఊపుతోందో, యజమాని మనస్సు కనిపెట్టి నన్ను ఆహ్వానిస్తోందో తెలియడం

లేదు. జార్జిటుచీరమీద నగిషీపనిలాగ తోచింది వెండి వెన్నెలలో ఆ దృశ్యం.

అతని కళాదృష్టికీ, ఆ అలంకారాలకీ ముగ్ధుణ్ణి అవుతూ లోపల అడుగు పెట్టేసరికి కళ్ళు చెదిరిపోయినా యంటే నమ్మండి. ఎదురుగా గోడకి ఓ పులి చర్మం వేలాడగట్టిఉంది, తోక సరంబీని అంటు తూను. ముందరికాళ్ళు రెండూ యిటూ అటూ చాచి ఉన్నాయి, పంజాలు విప్పి. భీకరంగా కనపడేటట్టు తల ఒక చిన్న మేజాఆధారంగా నిలబెట్టబడి ఉంది. ఆ పోజులో పులి గోడమీద నుంచి దుముకుతోందా అనిపిస్తోంది. ఆ పులిచర్మానికి యిరుప్రక్కలా రెండు నిలువుటద్దాలు. గదిని ఆవరించుకుని నీలిరంగుజంబుఖానా పరిచిఉంది. దాని మధ్యస్థంగా నగిషీ చేసిన సింహపుకోళ్ళ ఆగ్రాబల్ల, చుట్టూ మెత్తని సోఫాసెట్టూను. రెండే రెండు రవివర్మ చిత్రాలు ఆ గోడనీ యీ గోడనీ జీకళలు ఉట్టిపడు తున్నాయి. సోఫాలో కూర్చుని తన్మయత్వంతో చూస్తున్నాను.

ఆయన తెర తొలిగించి ప్రక్కగదిలోకి వెళ్ళేడు. స్విచ్ వేసిన వెలుతురులో ఓ పందిరిమంచం, దాని ప్రక్కని చిన్న మేజామీద 'నగ్నసుందరి' చేతిలో టేబిలులైటూ కనిపించేయి. మంచానికి యివతలి ప్రక్క గోడ నానుకుని మార్బులుపలక మేజా ఒకటి అందాలు ఒలుకుతోంది. దాని చివరి అంచునే మూడు రేకలుగా విడిన అద్దం అమర్చి వుంది. వెండితొడితో ఉన్న దంతపు దువ్వెనలు రెండూ, చక్కటి పౌడరుడబ్బీ, స్నోసీసా, గిల్టువేసిన పన్నీరుబుడ్డీ వున్నాయి దానిమీద. నీలి రంగు దీపకాంతి అందంగా వున్నగదిని శోభావంతంగా కనబరుస్తోంది. ఇతోధికం అవుతూన్న కుతూహల ఆహ్లాదాలతో నాకలోకానికి కొస్త దూరంలో ఉన్నాను.

ఇంతలో చంటిపిల్లడు గగ్గోలు! ఆ ఏడుపుకి యిల్లు మారుమ్రోగిపోతోంది. ఇల్లు అంతా అంత శుభ్రంగా ఉండబట్టి గాని లేకపోతే ఏ తేలో, జెర్రో అంటబొడిచింది అనుకునేవాణ్ణే.

లోపలినుంచి ఆయనభార్య కాబోలు, చదువుతూన్న పత్రికతోనే పరుగెత్తుకు వచ్చి నన్ను చూసి గుమ్మంలోనే ఆగిపోయింది. ఆయన పిల్లణ్ణి ఎత్తుకున్నాడు. ఎంత సముదాయించినా ఊరుకోవడం లేదు పిల్లాడు. కళ్ళు నులుముకుంటూ మరీ యిదిగా ఏడుస్తున్నాడు.

"బేబీ, బేబీ" అంటూ నాచేతుల్లోకి తీసుకున్నాను.

"చప్పికి చేతిమీద పెట్టిన జింక్ ఆయింటుమెంటు కళ్ళలోకి వెళ్ళింది గాబోలు. పెద్ద ప్రమాదం ఏమీ లేదుకాని, మంట భరించడం కష్టంగాదూ ? ఇలాంటివి పెట్టినప్పుడు ఎవరైనా దగ్గిర వుండి చూడాలి మరి" అన్నాను.

"ఇంతసేపూ వాడితోనే ఉన్నాను. అలా పాకురుకుని వెళుతూఉంటే తండ్రిదగ్గిరికి పోతున్నాడు గదా అని పత్రిక పుచ్చుకున్నాను, మరి. అయినా, నిమిషంలో చేస్తాడు ఏవో చిలిపివెధవపనులు !" ఆవిడ అన్న ఆ మాటల్లో వాత్సల్యం, ఆవేదనాకూడా కనబడ్డాయి.

"కొంచెం గోరువెచ్చని నీళ్ళు తెప్పించండి. గుడ్డ ముంచి తుడిస్తే మంట తగ్గుతుంది."

పదినిమిషాల్లో పిల్లడు మళ్ళీ బంతిలాగ ఆడుకుంటున్నాడు.

"అమ్మయ్య ! నిమిషంలో పూరుకున్నాడు. ఎంతలో కనిపెట్టేరూ ?" అన్నాడాయన, కృతజ్ఞత వ్యక్తపరుస్తూ.

"దానికేం లెండి. నా వృత్తే యిది" అన్నాను.

"ఇంకా నయం, మీరు ఉండబట్టి సరిపోయింది కాని, లేకపోతే కడుపు పొంగిపోను చంటివెధవకి" అంది ఆమె—నేను ఏదో మహోపకారం చేసినట్టూ, లేకపోతే పిల్లడు యింక వారికి దక్కనట్టూను.

"పోనీ లెండి, యిప్పుడు మళ్ళీ మామూలుగా ఆడుకుంటున్నాడుగా"

"ఇలాంటివి జరుగుతాయనే దాసీదాన్ని పెట్టేను, ప్రత్యేకించి వాడికోసమని. ఉండి చస్తేనా

ఒక్కత్తె అయినాను! ఈ ఊరికి వచ్చిన యీ నెల్లాళ్ళలోనూ ముగ్గురు పనిమనుషులయినా మారేరు. ఒక్కతయినా పట్టుమని పదిరోజులు ఉన్నపాపాన్ని పోలేదు. ఇళ్ళకి పోయేటప్పుడు పదిమందీ కట్టగట్టుకుని తగులబడుతారారాయె, ఊళ్లో భోగట్టాలు ఉపన్యాసాలు అఘోరిస్తూను."

ఆమెకళ్లు చెమ్మగిలడం దీపపుకాంతిలో స్పష్టంగా కనిపించింది. ఆమెహృదయంలో ఏదో చెప్పలేని చికాకు!

## 3

మర్నాడు ప్రొద్దున్నే ఆ చొక్కా పట్టుకుని నేషనల్ లాండ్రీకి వెళ్ళేను. అది తీసుకుని నా లాల్చీ యిచ్చేసేడు, మామూలుగా బల్లదగ్గర కూర్చునే ముసలాడు. ఎవరి నోటా పల్లెత్తు అనవసరప్రసంగం లేకుండా పని జరిగిపోయింది.

ఆ వెంకట్రావుగారూ యిక్కడికే వస్తూ ఉంటానన్నాడుగా. ఆయనపేరు తలుచుకుంటే నిన్నటి సంగతి జ్ఞాపకం వచ్చి గుండె జల్లుమంది. ఎంతసున్నితంగా వ్యవహరించేడూ! మొహమెటానికి కాదన్నా ఆ చొక్కా తనదే అయివుంటుంది. ఔను, తను మనిషీ, యీమాత్రపు మహద్భాగ్యానికి వెలితిబడిపోతాడా? అసలు అది ఏ పుట్టినరోజు 'ప్రెజెంటో' అయిఉంటుంది. వస్తువుమీది ఆ వ్యామోహంలోనే తెలియడంలేదూ అతనికీ, దానికీ ఉన్న అంతర్యం?

ఏదో ఘరానాఉద్యోగస్థుడే అయివుంటాడు. లేకపోతే ఆ నాజూకూ, ఆ మాటసరసతా అలవడుతుందా?

సందర్భం తరచిచూస్తున్నకొద్దీ ఆయన అంటే అమితమయిన ఆదరభావం ఏర్పడింది. ఇంకా ఇంకా యెన్నో విషయాలు కళకీ, నాగరికతకీ సంబంధించినవి ముచ్చటించాలనిపించింది. లాండ్రీదగ్గర ఎవరైనా ఉన్నారు గాని ఆయన కనిపించలేదు. ఇంతకూ, ఆయన వచ్చేడో లేదో యివాళ.

అడిగేసేను, యెందుకీ గుంజుకొమ్ములు అనుమానం అని—

"వెంకట్రావుగారు యివాళ వచ్చేరుటయ్యా?"

బల్లదగ్గర ఉన్న ముసలాడు రెండు నిమిషాలు నన్ను ఎగాదిగా పరీక్షగా చూసేడు.

"వెంకట్రావుగారు వచ్చేరా అని అడిగితే అలా చూస్తావేమిటి, సర్కస్సు జంతువుని చూసినట్టు?"

"ఆ. లోపల ఆగదిలో వున్నాడు; వెళ్ళండి" అన్నాడు ముసలాడు.

ఏకవచనప్రయోగం! మాటలో నిరాదరణ! 'ఎద్దుకేమి తెలుసును అటుకుల రుచి!' అనుకున్నాను.

ఆ గదిలో ఓమూల మాసినబట్టలు గుట్టగా పడి ఉన్నాయి. నలుగురు చాకలివాళ్ళు వాటిని చిన్న చిన్న మూటలుగా, నంబరువారీగా విడబరుస్తున్నారు. ఇంకోవార, గోడచేర్పుగా సన్నని, పొడుగాటి బల్లమీద యిస్త్రీబట్టలు పడిఉన్నాయి దొంతరదొంతరలుగాను. వార్డురోబులో కొయ్యలకి వేలాడదీసి కొన్ని కోట్లు, 'బుష్‌షర్టు'లూ వున్నాయి కాగితంముక్కల్లాగ యిస్త్రీచేసి. వీటి కన్నిటికీ రసీదులు ఏర్పరచి, బిల్లునంబర్లప్రకారం సబ్బుకాగితాల్లో పేకింగు చేస్తున్నారు ఓ కొంతమంది. ఈ జట్టుని కాస్తూ, వాళ్లల్లా కళ్ళు చేసుకుని చూస్తూ కార్యనిమగ్నుడయి ఉన్నాడు వెంకట్రావుగారు, చేతుల్లేని బనీను వేసుకొని, తెల్లని గూడకట్టుకట్టుకుని. నా కళ్ళు నేనే నమ్మలేకపోయేను.

నన్ను చూడ్డంతోటే నమస్కరించి ఆసనం చూపించేడు. వేషం మారిందికాని, ఆ సంస్కృతీ, ఆ నాజూకూ ఉట్టిపడుతూనే వున్నాయి అతను ఆడుతూన్న ప్రతీమాటలోనూ. వెంకట్రావుగారే!

గ్రహించేను.

ఆయనకి రజకవృత్తి కులవిద్య. అయినప్పటికీ కాస్త వొక్క శుద్ధి అవడంవల్ల నెమ్మదిగా స్కూలు ఫైనలు ప్యాసయే ననిపించుకున్నాడు. యుద్ధంమూలాన్ని రాజకీయాలతో ఎక్కువగా పరిచయం కలిగింది. నలభైరెండులో జరిగిన ఆ సంఘటనలు ఏ హిందూయువకుని రక్తనాళాల్లోకి చొచ్చుకుపోలేదు! ఏ భారతీయుని హృదయాన్ని ఉత్తేజితం చెయ్యలేకపోయినాయి!!

సమయం మించిపోకుండా యుద్ధంలో చేరేడు వెంకట్రావు. దేశదేశాలు పర్యటించడంతో విజ్ఞానం, సంస్కృతీ అతనిలో ఇతోధికం అయినాయి. పరాయి దేశాల్లో తన కులవిద్య ఎలా నడిపించేదీ చూసి తెలుసుకున్నాడు. ప్రవర్తనాసౌశీల్యం జీవికి నికషోపలం అని పాఠం చెప్పుకున్నాడు. "నేషనల్ లాండ్రీలో దొంగలు పడ్డా బట్టలు మాత్రం పోవు" అని లోకులు చెప్పుకునేటట్టు మెలిగేడు.

సంస్కృతి గల జీవికి జీవితం తెరచాప ఎత్తిన పడవలాగ సాగిపోతుంది అంటారు. నిజమే. అతని ఆర్జనకి లోటులేదు. ఆర్జన ఎక్కువ అవుతూన్నకొద్దీ అతనికి ఒక అంతస్తు ఏర్పడుతూ వచ్చింది.

తన కళోపాసన తన్మాధుర్యాన్ని అతిశయింప జేసింది.

అయితేనేం? పున్నమవెన్నెల్లోనే అమావాస్య చీకట్లు గోచరిస్తూఉంటాయి. సౌఖ్యవారాశితరంగాల లోనే తుపాను చెలరేగుతూ ఉంటుంది. వెంకట్రావు గారికీ ఓ కొఱత! ఎన్ని విధాల యత్నిస్తూన్నా అది తీరడంలేదు. అనేకవిధాల యత్నించేడు. పలువిధ మార్గాలు త్రొక్కి చూచేడు. లాభం లేకపోయింది. నాడా అర్థాంగి అడిగినప్పుడు 'ఇస్! యిదేనా మహద్భాగ్యం' అన్నాడు ఎంతో తేలికగాను. బూరుగు దూదికన్నా తేలిక అనుకున్నది భూమికన్నా బరువైనట్టు తోస్తున్నది పరిస్థితులు చూస్తూన్నకొద్దీని.

తను ఎంత చదువుకుంటేనేం? ఆమె ఎంతటి సుగుణసంపత్తి కలదయితేనేం? వారికి ఉన్న డబ్బువల్ల మాత్రం ఏం పని జరిగిందీ?

కొన్నికొన్ని విషయాల్లో సంఘం "తాఁబట్టిన కుందేటికి మూడే కాళ్ళ"ని కూర్చుంటుంది. వెంకట్రావుగారు పిల్లకిని ఆడించడానికి పనిమనిషిని కుదర్చలేకపోయారు. చాకలివాళ్ళ యిళ్ళల్లో కాపువాళ్ళు పని చెయ్యరు నిలువెత్తు ధనం పోసినానూ! కులం తక్కువట.

అందుకా, నిన్న ఆమె కంట నీరు పెట్టుకుంది. నిజమే. పనిమనుష్యులు పదిమందీ కట్టుకట్టుకునే యిళ్ళకి పోతారు. ఊళ్ళో భోగట్టాలు ప్రాకిపోవడానికి వాళ్ళకి మించిన 'గజెటు' లేదు. "ఏ మనిషీ పట్టుమని పదిరోజులయినా ఉండటంలేదు" అంటే ఆశ్చర్యం ఏముందీ? ఆమె ఎంత చిన్నబుచ్చుకుంటోందో!

"నేను చూస్తానులెండి" అని యింటికి వచ్చేసేను, దారిలో నర్సింగుహోముదగ్గిర ఓ పావుగంట ఆగి.

* * * *

కిరస్తానపుదాదిని ఒకతెని వాళ్ళ యింటికి పంపినట్టు నర్సింగుహోముడాక్టరు మర్నాడే నాకు ఫోనులో చెప్పేడు.

